కథ

# షీరో

డా. చెళ్లపిళ్ల సూర్య లక్ష్మి,
94451 84363

డాక్టరేటు పట్టా సంపాదించడానికి వైవా వోసీ జరగబోతోంది ఆ పెద్ద హాలులో. పరిశోధన చేసిన విద్యార్థినిని చూసి జడుసుకున్నాడు వేరే ఊరి నుండి వచ్చిన నిపుణుడు. ఆమె దగ్గరగా లేనప్పుడు..

'ఈ అమ్మాయేనా పోషణ మీద ఇంత మంచి సిద్ధాంత గ్రంథం రాసింది?' అని, ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

మన దేశంలో ఇది మామూలేనని ఆ అమ్మాయి తాలూకు గైడ్ ఆ విషయం పట్టించుకోలేదు.

అడిగిన ప్రశ్నలకి బ్రహ్మాండంగా జవాబులు చెప్పి, అందరి మన్ననలు అందుకున్న ఆ అమ్మాయి సాగరిక.. ఒకప్పటి 'చేపల్లాంటి' తన కంటి కొనల్లోంచి జారబోతున్న కన్నీటిని రుమాలుతో తుడిచేసింది. తనని చూసి జడుసుకోవడం, తనని వింత, వికృతమైన చూపులు చూడ్డం ఆమెకొక రొటీన్ అయిపోయింది. ఇంత అలవాటు పడినా, తన చర్మం మొద్దుబారిన విషయాన్ని ఇంకా తన మనసు అంగీకరించలేదేమో! అప్పుడప్పుడూ అందవిహీనమైన తన కళ్లు చిప్పిల్లుతూనే ఉంటాయి.

* * *

''డాక్టర్ సాగరికా! ఈ రెస్టారెంట్ గురించి మీరు ఎక్కడ తెలుసుకున్నారు?'' అడిగింది ఒక ఆవిడ.

''న్యూస్ పేపర్లో మేడమ్'' జవాబిచ్చింది ఆమె.. ఒక ఫైల్‌లోకి చూస్తూ.

''మీరు బాగా చదువుకున్న వారు. ఒక చిన్న రెస్టారెంట్‌లో పని చేద్దామని ఎందుకు వచ్చారు?'' అడిగింది మరో స్త్రీ.

సాగరిక చిరునవ్వుతో..

''మేడమ్! ఎంత చదువుకున్నా, ఒక్క మంచి ఉద్యోగం కూడా సంపాదించలేక పోయాను. కారణం..'' అంటూ, తన మొహం చుట్టూ వేలు తిప్పి,

''ఈ మొహం! ఇది ఒక రెస్టారెంట్ కాబట్టి మీ చెఫ్‌లు రుచి గురించి ఆలోచిస్తే.. నేను ఆరోగ్యం, పోషకాహారాల గురించి జాగ్రత్త తీసుకుంటాను. వాల్యూ ఎడిషన్ అయినట్టే కదా మేడమ్!'' అంది.

ఆవిడ తలూపుతూ..

''దీనితో మీ బాధ్యత పూర్తయిపోతుందా?'' అని అడిగింది.

సాగరిక నవ్వుతూ..

''ఈ స్థలం కేవలం ఆర్డర్ ఇచ్చిన టిఫిన్ తిని వెళ్లిపోవడానికి కాదనే ఉద్దేశంతో ఈ రెస్టారెంట్ తెరిచారు. మీ కల నిజమవ్వాలంటే మన ఈ చోటు.. స్త్రీలు నిర్భయంగా తమ కష్ట సుఖాలు పంచుకునే ఒక పవిత్రమైన ఆలయం కావాలి. ఈ కలను సాకారం చేయడానికి నాకో అవకాశం ఇస్తారా?'' అని మర్యాదగా అడిగింది.

ఇంటర్వ్యూ చేసినావిడ చిరునవ్వు నవ్వి, సాగరికను తమ బృందంలోనికి స్వాగతించింది.

* * *

గుండ్రటి టేబుల్‌లో కూర్చున్న అమ్మాయిలను పరిచయం చేసింది ఇంటర్వ్యూ చేసిన ప్రమీల.

''డియర్ ఫ్రెండ్స్! ఈరోజు మన ప్రయత్నంలో ఒక కొత్త భాగస్వామిని పరిచయం చేస్తాను. ఈమె పేరు డా. సాగరిక. మీ పరిచయాలు, కథా-కమామిషు మొదట కానివ్వండి. ఆవిడ గురించి ఆమే తరువాత చెప్తారు'' అని ముగించింది.

మొదటి అమ్మాయి..

''నైస్! నా పేరు నర్మద. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు మా కాలేజీ పోకిరిగాడు నన్ను ప్రేమించమని వెంటపడే వాడు. నేను వాడికి నచ్చే జవాబు చెప్పలేదని ఒకరోజు క్యాంటీన్‌లో నా మొహంపై యాసిడ్ పోశాడు దరిద్రుడు. ఆ బాధ ఎలా భరించానో దేవుడికే తెలియాలి. మా ఇంట్లో వాళ్లు నా చదువుకు మంగళం పాడేశారు. నేను ఉద్యోగం చేసి, నా కాళ్ల మీద నేను నిలబడతానని.. ఒక వంట



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.